క్లుప్తంగా

వైభవంగా కలశ ప్రతిష్ఠ



అమ్మవారి సమక్షంలో కలశాలను ఉంచిన దృశ్యం

మద్దికెర : స్థానిక సొసైటీ వద్దనున్న చౌడేశ్వరీ దేవాలయంలో ఆదివారం కలశ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కలశాలకు పూజలు చేశారు. అభిషేకం, మహామంగళహారతి కార్యక్రమాలు నిర్వహించి నైవేద్యం సమర్పించి ఆలయంపై కలశాలను ప్రతిష్ఠగావించారు. అనంతరం పూజలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు.

కిరీటం, ఊయల, గ్రిల్ విరాళం..

భక్తులు పూజారి ఆంజనేయులు కుమారులు అమ్మవారికి రూ.15 వేల విలువజేసే పంచలోహ కిరీటం, రూ.11 వేలు విలువజేసే ఊయలను విరాళంగా అందజేశారు. అలాగే స్థానిక భక్తుడు కుండా రామాంజులు కుమారుడు కుండా సూరి రూ.12 వేల విలువజేసే గ్రిల్ చేయించారని ధర్మకర్త పెద్దకోట్ల రమేష్ తెలిపారు.

20న బిల్లేకల్లు మార్కెట్ వేలం

ఆస్పరి: మండలంలోని బిల్లేకల్లు దినసరి కూరగాయలు మార్కెట్ వేలం ఈనెల 20వ తేదీన పంచాయతీ కార్యాలయ అవరణలో నిర్వహించనున్నట్లు సర్పంచ్ బొందిమడుగుల శ్రీను ఆదివారం తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.లక్ష డిపాజిట్, రూ.లక్ష సాల్వెన్సీ సర్టిఫికెట్‌తో పాల్గొనాలని సూచించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

తుగ్గలి : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ఎర్ర నాగప్ప అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సావిత్రి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.ఉదయం 11గంటలకు నిర్వహించే సమావేశానికి జెడ్పీటీసీ,ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు,అధికారులు హాజరుకావాలని కోరారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



సీఐ విజయభాస్కర్

దేవనకొండ: మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, అసాంఘిక శక్తుల ఆట కట్టిస్తానని నూతన సీఐ విజయభాస్కర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ నూతన సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ తాను నందికొట్కూరు పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై వచ్చానన్నారు. సమస్యలు ఉన్న ప్రజలు నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, మధ్యవర్తులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



పంచనామా నిర్వహిస్తున్న వీఆర్వో. పోలీసులు

మద్దికెర : స్థానిక బస్టాండులో గుర్తు తెలియని వృద్ధురాలు (70) ఆదివారం మృతి చెందడంతో పంచాయతీ సిబ్బంది అంత్యక్రియలు నిర్వహించారు. స్థానికుల సమాచారం మేరకు ఎక్కడ నుంచి వచ్చిందో తెలియదని కొద్దిరోజులుగా బస్టాండ్ వద్దే వుంటూ భిక్షమెత్తుకుంటూ జీవనం సాగించేదన్నారు. విషయం తెలుసుకున్న వీఆర్వో రంగస్వామి, పోలీసులు భరత్ సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించగా, పంచాయతీ సిబ్బంది అంత్యక్రియలు చేపట్టారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



భరతనాట్యం చేస్తున్న కళాకారిణి

మంత్రాలయం : రాఘవేంద్రుడి ఆరాధనోత్సవాలను పురస్కరించుకుని యోగీంద్ర మంటపంలో ఆదివారం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో శ్రీమఠం కళాకారులు రాఘవేంద్రుల జీవిత చరిత్ర నాటక ప్రదర్శన, బెంగళూరు రూపశ్రీ ప్రభంజన్ దాసవాణి, నెల్లూరుకు చెందిన దేవత సిస్టర్స్ భరతనాట్యం ఎంతగానో ఆకట్టుకున్నాయి.



ప్రసంగిస్తున్న పీఠాధిపతి

కనుమరుగవుతున్న పాలధార

- ఒకప్పుడు పల్లెల నుంచి పట్టణాలకు పాలు
- ప్రస్తుతం పట్టణాల నుంచి పల్లెలకు పాల ప్యాకెట్‌ల దిగుమతి
- నిర్వహణ భారంతో తగ్గిన పశుపోషణ
- గ్రామాల్లో చుక్క పాలు లభించని వైనం
- ప్రభుత్వం నుంచి కొరవడిన సహకారం





నిర్వహణ భారమై ఇటీవల నగరడోణలో మూతబడిన పాడిపరిశ్రమ, పశువులకు వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్యులు (ఫైల్)

చిప్పగిరి: లేగ దూడల అరుపులు, గెంతులు, పశువుల మందలు, నిత్యం పాలధారలు.. పల్లెలకు ఇవన్నీ కిరీటాలు. అయితే ఇదంతా ఒకప్పటి మాట. ప్రస్తుతం గ్రామాల్లో పశు సంపద పూర్తిగా తగ్గిపోతోంది. గ్రామాల నుంచి పాలు పట్టణాలకు తరలించి విక్రయించే వారు. ఇప్పుడేమో పట్టణాల నుంచి పాలప్యాకెట్లను తెప్పించుకోవాల్సిన దుస్థితి దాపురించింది. పదేళ్ల క్రితం వరకు పల్లెల్లో ప్రతి ఇంట్లో పశువులుండేవి. పాలకు కొదవుండేది కాదు. ఇరుగుపొరుగు వారికి కూడా ఉచితంగానే ఇచ్చి పుచ్చుకునేవారు. ప్రభుత్వ సహకారం కొరవడటం, పశుపోషణ భారం కావడం, పాల సేకరణ కేంద్రాలు మూసేయడం, పాలప్యాకెట్ల వ్యాపారం పుంజుకోవడంతో పశువుల సంఖ్య ఏటేటా గణనీయంగా తగ్గిపోతోంది. నేడు మండలంలోని గ్రామాల్లో చుక్క పాలు కూడా లభించడం లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

గతంలో..

ప్రతి రైతు ఇంట్లో పదేళ్ల క్రితం వరకు పశువులుండేవి. ఎద్దులతో పాటు ఆవులు, గేదెలు, మేకలు పెంచుకునేవారు. కొందరు వాటిని పోషించుకొని పాలు విక్రయించి జీవనం సాగించేవారు. దీంతో ప్రతి ఇంట్లో పాలధారలు సమృద్ధిగా ఉండేవి. ఎక్కడ శుభ కార్యం జరిగినా ఉచితంగా ఇచ్చి పుచ్చుకునేవారు. ఇక పసిపిల్లలకు పాలు అవసరమైతే వారే ఇంటికి తెచ్చి ఇచ్చేవారు. అయితే..క్రమేణా వాద్యులు పెరిగి పశువులు మృతి చెందడం, పాడి పరిశ్రమకు ప్రోత్సాహం కొరవడటం, పశుపోషణ భారంగా మారడంతో ఉన్న వాటిని రైతులు, పోషకులు విక్రయిస్తున్నారు. దీంతో మండలంలో పశు సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. కొన్నేళ్లకు పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందని ప్రజలు పేర్కొంటున్నారు.

భారంగా మారిన పశుపోషణ..

గతంలో పొలాల్లోనే పశువులకు అవసరమైన మేత లభించేది. ప్రస్తుతం మేత పంటలు తక్కువగా సాగవుతుండటం, సాగైనా మిషన్ల ద్వారా నూర్పిడి చేయిస్తుండటంతో పశువులు ఆ గడ్డిని తినడం లేదు. ఇక పచ్చి గడ్డి దొరకడం గగనంగా మారింది. దీంతో పశువులకు సరైన మేత లభించడం లేదు. సాధారణంగా ఒక ఆవు లేదా బర్రె ఈనిన తరువాత నాలుగు నెలల పాటు పాలు ఇస్తుంది. ప్రస్తుత ధరలకు ఈ పాలు విక్రయించిన సొమ్ములో 70 శాతం పశుపోషణకు వెచ్చించాల్సి వస్తుంది. అలాగే ఆ తరువాత మళ్లీ ఈనే వరకు పశువును పోషించడం రైతులకు భారంగా మారుతోంది. ఒకవేళ పాలు విక్రయిద్దామంటే స్థానికంగా కొనేవారు లేకపోవడం, పాలు సేకరణ కేంద్రాలు లేక, పట్టణాలకు వెళ్లి విక్రయిద్దామంటే అందుకయ్యే రవాణా చార్జీలు తడిసిమోపెడవుతుండటం.. ఇవన్నీ అవస్థలు పడలేక రైతాంగం పశువులను దూరం చేసుకుంటున్నారు. ఈ కారణంగా పల్లెల్లో స్వచ్ఛమైన పాలు లభించని పరిస్థితి నెలకొంది.

పాలప్యాకెట్‌కు డిమాండ్..

గతంలో గ్రామాల్లో లభించే పాలతో హోటళ్లలో వాడేవారు. వాటితో చేసిన ఉత్పత్తులు నాణ్యంగా, రుచిగా ఉంటుండేవి. అయితే ఆ పాలు ఎక్కువసేపు నిల్వ ఉండకపోవడం, అత్యవసర సమయాల్లో తగినంతగా లభించకపోవడంతో హోటళ్ల నిర్వాహకులు ప్యాకెట్ల వైపు మళ్లారు. చివరకు పట్టణాల నుంచి పల్లెలకు ఆ సంస్కృతి పాకడంతో పాల కొనుగోళ్లు పూర్తిగా మందగించాయి. కొనుగోలుదారులు లేకపోవడం, ప్యాకెట్ల వ్యాపారం పుంజుకోవడంతో పాడి రైతులు పశువులను వదులుకోవడం ప్రారంభించారు. ఆ పరిణామం చివరకు స్వచ్ఛమైన పాటు చుక్క కూడా లభించని స్థితికి చేరింది.

2019 గణాంకాల ప్రకారం మండలంలో పశువుల వివరాలు గ్రామాల వారీగా..

అదికారుల తెలిపిన లెక్కల ప్రకారం మండలంలో అవుల సంఖ్య.. చిప్పగిరి 998, దౌల్తాపురం 136, నంచర్ల 685, ఏరూరు 293, డేగులహాలు 237, బంటణహాలు 223, కాజీపురం 223, గుమ్మనూరు 176, రామదుర్గం1,245, నగరడోణ738, నేకల్లు 822, బెల్డోణ 532, కుందనగుర్తి 383 ఉండగా మొత్తం..6,691 ఆవులున్నాయి.

గేదెల సంఖ్య..

చిప్పగిరి 345, దౌల్తాపురం 50, నంచర్ల 197, ఏరూరు 33, డేగులహాలు 62, బంటణహాలు 103, కాజీపురం 10, గుమ్మనూరు 57, రామదుర్గం 119, నాగారాడోణ 74 నేమకల్లు 93, బెల్డోణ 176, కుందనగుర్తిలో 39 ఉండగా మొత్తం 1,358 గేదెలున్నట్లు అదికారులు తెలిపారు. అయితే ఇవన్నీ గతంలోని లెక్కలు. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఆయా గ్రామాల్లో పదిశాతం కూడా పశువులు లేవని గోపాల మిత్రలు చెబుతున్నారు. ఈ లెక్కన మండలం మొత్తం మీద ఆవులు, గేదెలు కలిపి 800 కూడా లేవని వారు చెబుతున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

రాయితీపై పశువులు అందజేయాలి



మండలంలోని పేద, మధ్య తరగతి కుటుంబాల మహిళలను గుర్తించి ప్రభుత్వం వందశాతం రాయితీతో పాడి పశువులను పంపిణీ చేయాలి. అలాగే పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి పాలు కొనుగోలు చేయాలి. తద్వారా పేద మహిళలు అర్థికంగా ఎదగడానికి వీలు కలుగుతుంది. అలాగే నిరుద్యోగిత తగ్గడం, పశువుల సంఖ్య పెరుగుతుంది.ప్రజలకు స్వచ్ఛమైనపాలు లభించడంతో సమాజం ఆరోగ్యంగా ఉంటుంది.

– జూటూరు హేమలత, ఎంపీపీ

పథకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి



పాడి రైతలకు ప్రభుత్వం అందించే వివిద పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. ప్రస్తుతం గోకులం షెడ్ల నిర్మాణానికి ఆదేశాలు జారీ ఆయ్యాయి. అవసరమైన వారు స్థానిక పశువైద్యశాలలో సంప్రదించాలి. పశువులను వ్యాధుల నుంచి రక్షించేందుకు టీకాలు వేస్తున్నాం. పాడి రైతుకు ఎలాంటి పథకాలు విడుదల చేసినా తెలియజేస్తాం. పాడి పరిశ్రమ నిర్వహణపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– ప్రసన్నబాయి,వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్

నిర్వహణ భారమై రెండు జెర్సీ ఆవులను అమ్మేశా



సంవత్సరం క్రితం స్వయం ఉపాధి కోసం రూ 60,000 వెచ్చించి రెండు జెర్సీ అవులను కొనుగోలు చేశా. కొన్న వెంటనే రెండు పశువులు ఈనడంతో పాల దిగుబడి రోజుకు 10 లీటర్ల వరకు వచ్చేది. గ్రామంలో కొనుగోలు చేసేందుకు స్థానికులు ఇష్టపడకపోవడంతో పట్టణాలనికి తీసుకెళ్లి అమ్మడానికి రవాణా ఖర్చులు పెట్టుకోలేక అవులు ఇస్తున్న పాలను దూడలకే వదిలి వేశాం. అటు పాలు అమ్ముకోలేక, పశువుల మేత భరించ లేక తెచ్చిన అవులను సగం ధరకే అమ్ముకున్నా. పాల ప్యాకెట్‌ల కారణంగా స్వచ్ఛమైన పాలకు ఆదరణ తగ్గింది. పట్టణాల్లోని డెయిరీల్లో వెన్న శాతాన్ని బట్టి పాలకు ధర ఇస్తారు. ఆవు పాలకు రూ. 30 వరకు ఇస్తే గేదె పాలకు పాలకు రూ. 60 వరకు ఇస్తారు. ఆ ధర రైతుకు, పశువుల మేతకు కూడా సరిపోదు..

– లింగప్ప నంచర్ల గ్రామం

దేవరగట్టులో శ్రావణమాస ప్రత్యేక పూజలు



మాళమల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఆలయ పూజారులు

హొళగుంద: దేవరగట్టులో శ్రావణ మాసం రెండవ ఆదివారం సందర్భంగా మాళమల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయంలోని మూల విరాట్‌కు జలాభిషేకాలు, సుప్రభాతసేవ, భండరార్చన, కుంకుమార్చన, మహామంగళ హారతి, ఆకుల అలంకరణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను పూజారులు పంపన్నస్వామి, మల్లయ్యస్వామి శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదం అందజేశారు. కొందరు భక్తులు సింహసన కట్ట నుంచి కొండపైనున్న ఆలయం వరకు మెట్టు మెట్టుకు దీపాలు వెలిగించడం, సాష్టాంగ నమస్కారం, పొర్లదండాలు, బండారం అంటిస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారిని దర్శించుకోవడానికి ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ఆలూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10:30 నుంచి 12:30 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తామని ఆర్ఐ బసన్నగౌడ్ ఆదివారం తెలిపారు. సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తారని చెప్పారు. ప్రజల నుంచి తహసీల్దార్ గోవింద్ సింగ్ దరఖాస్తులు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

25న టెంకాయల విక్రయానికి వేలం

హొళగుంద: మాళమల్లేశ్వరస్వామి దసారా బన్ని ఉత్సవాల్లో టెంకాయల విక్రయ హక్కుల కోసం ఈ నెల 25వ తేదీన ఆలూరు టీడీపీ ఇన్‌చార్జ్ వీరభద్రగౌడ్ ఆధ్వర్యంలో వేలం పాటలు జరుగుతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామపెద్దలు ఆదివారం తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు ముందుగా రూ.10 వేలు దరావత్తు చెల్లించాలన్నారు. వేలం దక్కించుకున్న వారు బన్ని ఉత్సవాలు ముగిసేంత వరకు గట్టులో టెంకాయలు అమ్ముకోవచ్చని చెప్పారు.

ప్రవర్తన మార్చుకోకపోతే చర్యలు తప్పవు



వెల్దుర్తి స్టేషన్‌లో రౌడీషీటర్లు, మాట్కాబీటర్లు, నాటుసారా తయారీదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ

వెల్దుర్తి: ప్రవర్తన మార్చుకుని నడుచుకోవాలని, అలా కాకుండా ఇలాగే అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని ఎస్ఐ జి. అశోక్ హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లు, మట్కాబీటర్లు, నాటుసారా తయారీదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇక నుంచి గ్రామాల్లో సారా తయారు చేస్తున్నట్లు, అమ్ముతున్నట్లు తెలిస్తే కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు.

నివాళి



కేసరి సత్యన్న మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి

చిప్పగిరి: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కేసరి సత్యన్న బైక్‌పై ఆదివారం సాయంత్రం గుంతకల్లు నుంచి గ్రామానికి వస్తుండగా గుంతల్లులోని కొట్టాల రోడ్డు వద్ద ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి చిప్పగిరిలోని మృతుని నివాసం చేరుకొని మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. మృతుడుకి భార్య రాధమ్మ,కుమారుడు శ్రీను ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన శేషాద్రి రెడ్డి

ఆలూరు రూరల్: చిప్పగిరి మండలం నగరడోణ గ్రామం సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. నగరడోణ గ్రామానికి చెందిన శేషాద్రి రెడ్డి మోటారు సైకిల్‌పై ఆలూరు నుంచి నగరడోణ గ్రామానికి వెళ్తుండగా..రోడ్డు పక్కన నిలిపి ఉన్న మరో బైక్‌ను ఢీకొట్టాడు. ప్రమాదంలో కుడికాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రయాణికులు గమనించి 108 వాహనానికి సమాచారం అందించి ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యపరీక్షలు చేసిన డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం బళ్లారి ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు, జర్నలిస్టులు



హొళగుందలో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న ఆయా పార్టీల నాయకులు, గ్రామస్తులు

ఆలూరు: కోల్‌కతా లోని ఆర్‌జీ కార్ వైద్యకళాశాలలో రెసిడెంట్ డాక్టర్‌పై కొందరు అత్యాచారం, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద ప్రజాసంఘాల నాయకులు, జనసేనపార్టీ, జర్నలిస్టు సంఘాల నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. వీరికి ఎమ్మెల్యే మద్దతు ప్రకటించారు. అనంతరం జర్నలిస్టుల యూనియన్ నాయకులు స్వరూప్ కుమార్, చంద్రబాబు,సూరి,శ్రీధర్ ,గోపాల్, నాగరాజు, తదితరులు మాట్లాడారు. జనసేన పార్టీ మండల ఆర్గనైజింగ్ కార్యదర్శి ఛత్రపతి పాల్గొన్నారు.

హొళగుంద: కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజ్‌లో ట్రైనీ డాక్టర్‌ను అత్యాచారం, హత్య చేసిన కిరాతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం రాత్రి ఆయా పార్టీల నాయకులు, గ్రామస్తులు కొవ్వొత్తులతో మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. స్థానిక బస్టాండ్‌లో జరిగిన కార్యక్రమంలో నాయకులు ఎస్కే గిరి, ఈశా, షఫివుల్లా, కుమారస్వామి, ద్వారకనాథ్, సురేష్, మల్లయ్య, శేఖర్, ఉమ్రి, మరిమల్ల, కరెంట్ లక్ష్మన్న మాట్లాడుతూ ప్రపంచం ఆధునికంగా అభివృద్ధి చెందుతున్నా.. మహిళలకు భద్రత లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చట్టాలు తీసుకురావాలని ప్రభుత్వాలను కోరారు.

మళ్లీ..బడి రోజుల్లోకి!



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

- 16ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

తుగ్గలి : మండలంలోని పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 2007–08 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 16ఏళ్ల తర్వాత తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు నారాయణరెడ్డి, నూర్‌అహమ్మద్, బాలు, జాకీర్, ఉపేంద్ర, మల్లేశ్వరి, పాండురంగరాజు, మురళీనాయుడును, ఎస్ఎంసీ చైర్మన్ అమీననాను ఘనంగా సత్కరించారు. సాయంత్రం వరకు ఆటపాటలతో సందడిగా గడిపారు.

హంద్రీనీవా నీటితో చెరువులను నింపాలి

ఆస్పరి: హంద్రీ–నీవా నీటితో మండలంలోని వెంగళాయిదొడ్డి చెరువు, ఆస్పరి, ముత్తుకూరు, చిన్న హోతూరు, నగరూరు, హాలిగేర, బిల్లేకల్లు, కారుమంచితో పాటు మరికొన్ని గ్రామాల చెరువులను నింపి నీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఆస్పరి మండలానికి మాత్రమే ప్రాజెక్టుల ద్వారా నీటి సౌకర్యం లేదన్నారు. వర్షాధారంతోనే రైతులు పంటలు పండించుకుంటున్నారన్నారు. ఏటా ప్రకృతి ఏదో ఒక విధంగా రైతులను దెబ్బతీస్తుందని, రెండు సంవత్సరాలు నుంచి విత్తనం వేసినప్పటి నుంచి వర్షాలు కురువక పంటలు ఎండిపోయి పెట్టుబడులు కూడా రాని పరిస్థితులు నెలకొంటున్నాయని అవేదన వ్యక్తం చేశారు. మండలానికి 13 కి.మీ. దూరంలో హంద్రీ నీవా ప్రధాన కాలువ ఉందన్నారు. మండల ప్రజలు వర్షా కాలంలో కూడా మంచినీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంటే ఎంత దారుణ పరిస్థితులు ఉన్నాయో అర్థం చేసుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి చెరువులను నింపాలని కోరారు. కృష్ణమూర్తి, ఉరుకుందప్ప పాల్గొన్నారు.

చవితి వేడుకలకు వినాయకులు సిద్ధం



వినాయక ప్రతిమలకు రంగులు వేస్తున్న దృశ్యం

మద్దికెర : సెప్టెంబర్ 7వ తేదీ జరిగే వినాయకచవితి పండుగ పురస్కరించుకొని పందిళ్లలో కొలువు తీరేందుకు వినాయక ప్రతిమలు సిద్ధం అవుతున్నాయి. గ్రామంలోని ఎడవలి రోడ్డులో ఏడాది పాటు వినాయక విగ్రహాలను తయారు చేస్తూ చవితి పండగకు విక్రయాలు చేస్తామని, విగ్రహం సైజును బట్టి రూ.3 వేలు నుంచి రూ.20 వేలు వరకు ధర ఉంటుందని తయారీదారులు తెలిపారు.

పందికోనకు నీటి విడుదలను పెంచాలి

దేవనకొండ: దేవనకొండ, పత్తికొండ మండలాలకు సాగునీరు అందించే పందికోన రిజర్వాయర్‌కు హంద్రీనీవా కాలువ కాలువ నుంచి నీటి విడుదల పరిమాణం పెంచాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వీరశేఖర్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వి.రంగారెడ్డి, నాయకులు యూసుఫ్ బాషా, శ్రీరాములు, బజారి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయా సంఘాల నాయకులు హంద్రీనీవా ప్రధాన కాలువ, పందికోన రిజర్వాయర్ స్లూయిస్‌లను పరిశీలించారు. వారు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో ఆలూరు, పత్తికొండ రైతులను ఆదుకునే పందికోన రిజర్వాయర్‌కు నీటి విడుదల పెంచాలని, ఈ ఏడాది హంద్రీనీవా విడుదల ఆలస్యమైనందున రైతాంగం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అలాగే కుడి కాలువకు కూడా నీటి విడుదలను పెంచి దేవనకొండ మండల రైతులను ఆదుకోవాలన్నారు. హంద్రీనీవా ప్రాజెక్ట్ స్థాయిని 100 టీఎంసీలకు పెంచాలని కోరారు. సిద్ధయ్యగౌడ్, కె.పి.రాముడు, రమేష్, కారుమంచి పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు

మద్దికెర:మండలంలోని ఎం.అగ్రహారం గ్రా మ ంలో నీటి పైపులైన్లు పగిలిపోవడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో పైప్‌లైన్‌కు ఆదివారం సర్పంచ్ విజయుడు ఆధ్వ ర్యంలో మరమ్మతులు చేపట్టారు. ఆయన మా ట్లాడుతూ గ్రామానికి నీటిని అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామస్తులు పనులు చేసుకునేటప్పుడు పైపులు ఉన్న చోట జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

గిరిజన గురుకుల పాఠశాలను కొనసాగించాలి



పాఠశాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థునుల తల్లిదండ్రులు

ఆలూరు: స్థానిక గిరిజన గురుకుల బాలికల పాఠశాలను తల్లిదండ్రుల అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోకుండా పత్తికొండ నియోజకవర్గంలోని తుగ్గలి ఆశ్రమ పాఠశాలకు ఎలా మారుస్తారంటూ విద్యార్థునుల తల్లిదండ్రులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. హత్తిబెళగల్ గ్రామ రోడ్డు సమీపంలో ఉన్న గిరిజన గురుకుల బాలికల పాఠశాల ఆవరణలోనే గిరిజన ఆశ్రమ గురుకుల బాలుర పాఠశాల ఉండడంతో బాలికలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయంటూ రవిశంకర్‌గౌడు లోకాయుక్తకు ఫిర్యాదు చేయడాన్ని విద్యార్థునుల తల్లిదండ్రులు ఖండిస్తూ పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. పాఠశాలను మార్చాలనే ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఏపీ గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి భార్గవి జారి చేసిన ఉత్తర్వులను వెనక్కు తీసుకోకపోతే ఆందోళనలకు పూనుకుంటామని వారు హెచ్చరించారు. విద్యార్థునుల తల్లిదండ్రులు పాఠశాల మార్పును అంగీకరించడం లేదని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులకు నివేధికను అందజేశామని పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ షాహిని విలేకరులకు తెలిపారు.

ఎస్ఐను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



ఎస్ఐ బాలనరసింహులును కలిసిన నాయకులు

హొళగుంద: ఎస్ఐగా ఇటీవల బాధ్యతలు తీసుకున్న బాల నరసింహులను ఆదివారం హొళగుంద, ఎల్లార్తి, హొన్నూరు క్యాంపు, నాగరకణ్వీ, బొమ్మగుండనహళ్లి తదితర గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మండల కన్వీనర్ షఫివుల్లా, షేక్షావలి, ఎస్కే గిరి, ఖాదర్‌బాషా, వెంకటేష్, పల్లి ఈరన్న, ఎంపీటీసీ శివన్న, రసూల్, పీరా, శేషప్ప తదితరులు కలిసి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా తమ గ్రామాల్లోని శాంతి భద్రతలు, ఇతర సమస్యలను ఎస్ఐకు వివరించారు.